ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం 17-06-2024 www.prajaswaramdaily.com 4 PM



# ఘోర రైలు ప్రమాదం

## 15 మంది దుర్మరణం

- 60 మందికిపైగా గాయాలు
- మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం
- పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ జిల్లాలో దుర్ఘటన
- రాష్ట్రపతి, ప్రధానితోపాటు ప్రముఖుల సంతాపం
- మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా..

ఢిల్లీ, జూన్ 17 (ప్రజాస్వరం): పశ్చిమ బెంగాల్ లోని డార్జిలింగ్ జిల్లా న్యూ జల్‌పాయ్‌గురిలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న కాంచనగంగ ఎక్స్ ప్రెస్ ను వెనుక వచ్చిన గూడ్స్ రైలు ఢీకొంది. రంగపాణి – నిజ్బారి స్టేషన్ల మధ్య జరిగిన ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. సుమారు 15మీ. ఎత్తులో బోగీ ఆగి ఉండడం ప్రమాద తీవ్రతను తెలుపుతోంది. రెస్క్యూ సిబ్బందితో పాటు స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొం టున్నారు. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు ఎలా వచ్చాయి.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై అధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ ప్రమాదంతో కొన్ని రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు.

### ఘటనా స్థలికి బెంగాల్ సీఎం, రైల్వే మంత్రి

రైలు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సందర్శించారు. సహాయ చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ రైలు ప్రమాద ఘటన షాక్‌కు గురి చేసిందని పేర్కొన్నారు. డాక్టర్లు, అంబులెన్స్‌లు, విపత్తు బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

### ప్రముఖుల సంతాపం

ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'డార్జిలింగ్‌లో జరిగిన రైలు ప్రమాదంలో పలువురు మరణించిన వార్త బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మృతుల కుటుంబాలకు ప్రధాన మంత్రి జాతీయ సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో కంచన్ జంఘా రైలు ప్రమాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. రైలు ప్రమాదంలో చాలా మంది మరణించారనే వార్త తనను కలచి వేసిందన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు.

# తప్పుడు ప్రచారం ఆపాలి



- క్రెడిబులిటీ దెబ్బతీయడం సరికాదు
- మాజీ మంత్రి హరీష్‌రావు

**హైదరాబాద్:** సోషల్ మీడియాలో తన క్రిడిబులిటీ దెబ్బతీసేలా అసత్య వార్తలు, కథనాలు ప్రసారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. నేను బీజేపీలోకి వెళుతున్నానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అవుతున్నానని దుష్ప్రచారం చేస్తున్నారు. అలాంటి వారికి లీగల్ నోటీస్‌లు పంపిస్తా. సోషల్ మీడియా వాళ్ల వ్యూస్ కోసం నా క్రెడిబులిటీ దెబ్బతీయడం సరికాదు అని హరీష్ రావు అన్నారు. నీట్‌పై నీలి నీడలు కమ్ముకున్నాయని, బీజేపీ హయాంలో విద్య కొందరి చేతుల్లోకి వెళుతోందన్నారు. వైద్య విద్య అంగట్లో సరుకైందన్నారు. పేపర్ లీకేజీ, గ్రేస్ మార్కులపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. నీట్ పై ప్రధాని మోదీ స్పందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. 67మందికి ఫస్ట్ ర్యాంక్ వచ్చిందన్నారు. ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు ఫుల్ మార్కులు వచ్చాయని తెలిపారు. నీట్‌లో గ్రేస్ మార్కులు కలిపే విధానమే లేదన్నారు. 1763మందికి ఎలా గ్రేస్ మార్కులు కలిపారని ప్రశ్నించారు. ఎవరికి గ్రేస్ మార్కులు కలిపారో బయట పెట్టాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.



# శభాష్ సురేష్ !

## ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు సీఎం రేవంత్ ప్రశంసలు

హైదరాబాద్, జూన్ 17 (ప్రజాస్వరం): యూపీఎస్సీ పరీక్ష రాసేందుకు వెళ్తున్న యువతికి లిఫ్ట్ ఇచ్చి సాయంచేసిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. 'వాహనాల నియంత్రణ మాత్రమే తన డ్యూటీ అనుకోకుండా సాటి మనిషికి సాయం చేయడం బాధ్యత అని భావించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్ కు నా అభినందనలు' అని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. కాగా నిన్న యూపీఎస్సీ పరీక్ష రాసేందుకు వెళ్తున్న ఓ యువతికి కానిస్టేబుల్ లిఫ్ట్ ఇచ్చిన సమయానికి పరీక్షా కేంద్రానికి చేర్చిన సంగతి తెలిసిందే. ఈ వార్త కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీఎం స్పందించి కానిస్టేబుల్‌ను మెచ్చుకున్నారు. ఆ యువతి యూపీఎస్సీలో విజయం సాధించాలని సీఎం కోరుకున్నారు. సీఎం అభినందించడంపై సురేష్ స్పందిస్తూ ఎంతో సంతోషంగా ఉందన్నారు.



# డ్రగ్స్ కేసులో డీజే సిద్ధార్థ్ అరెస్ట్

హైదరాబాద్, జూన్ 17 (ప్రజాస్వరం): పలు పబ్బుల్లో డీజేగా వ్యవహరిస్తున్న సిద్ధార్థ్ డ్రగ్స్ సేవిస్తూ అడ్డంగా దొరికిపోయాడు. పబ్బులకు నిత్యం వెళ్లే వారిని పిలిచి ఎస్ఓటీ అధికారులు పరీక్షించారు. గతంలో డ్రగ్స్ తీసుకున్న వారి లిస్ట్‌లో దొరికిన పేర్ల ఆధారంగా విచారణ నిర్వహించారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ ఎస్ఓటి అధికారులు 40 మందిని పిలిచి విచారించారు. డీజే సిద్ధార్థతో పాటు మరొక వ్యక్తికి డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. సిద్ధార్థ ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకున్నట్లుగా ఎస్ఓటీ అధికారులు గుర్తించారు. సిద్ధార్థని అదుపులోకి తీసుకొని ఎస్ఓటి అధికారులు మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. కొంతకాలం నుంచి సిద్ధార్థ పెద్ద మొత్తంలో ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకుంటున్నట్లు నార్కోటిక్ బ్యూరో గుర్తించింది.

# పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీలు

## భూముల మార్కెట్ వాస్తవ ధరకు.. ప్రభుత్వ ధరకు భారీ తేడా..

- మార్కెట్ విలువను పెంపొందించేందుకు ప్రభుత్వం అడుగులు
- వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, స్థిరాస్తులకు వర్తింపు
- జులై 1న నూతన ఛార్జీలు ప్రాథమికంగా ఖరారు
- సలహాలు, అభ్యంతరాల పరిశీలన పూర్తయ్యాక
- ఆగస్టు 1వ తేదీ నుంచి అమలు

హైదరాబాద్, జూన్ 16 (ప్రజాస్వరం): తెలంగాణలో భూముల ధరల పెంపునకు రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూముల మార్కెట్ వాస్తవ ధరకు.. ప్రభుత్వ ధరకు భారీగా తేడా ఉండటంతో మార్కెట్ విలువలను పెంపొందించేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈమేరకు రాష్ట్రంలో ఆగస్టు 1వ తేదీ నుంచి వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, స్థిరాస్తుల కొత్త రిజిస్ట్రేషన్ల ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవ సాయేతర భూములు, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ఛార్జీలు అమల్లోకి తెచ్చేలా అధికార యంత్రాగం కసరత్తు చేస్తోంది. జులై 1న నూతన ఛార్జీలను ప్రాథమికంగా ఖరారు చేయనున్న స్టాంపులు - రిజిస్ట్రేషన్ల శాఖ 20 రోజులపాటు వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించనుంది. భూముల మార్కెట్ విలువ సవరణలో తీసుకోవాల్సిన చర్యలపై సబ్ రిజిస్ట్రార్లకు సర్కార్ మార్గదర్శకాలు జారీ చేసింది. సలహాలు, అభ్యంతరాల పరిశీలన పూర్తయ్యాక తుది మార్కెట్ విలువను ఖరారు చేయనుంది. ఆయా ప్రాంతాల్లో స్థలాల వాస్తవిక ధరలను బట్టి మార్కెట్ విలువను నిర్ణయించనుంది.

### 18న ప్రాథమిక సమావేశం

ఈనెల 18న అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో స్టాంపులు - రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ప్రాథమిక సమావేశం నిర్వహించి కార్యక్రమం ప్రారంభించనున్నారు. దశలవారీగా పరిశీలన పూర్తి చేసి జులై 1న కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీలను ఖరారు చేయనున్నారు. అనంతరం పలు దశల్లో పరిశీలన పూర్తి చేసి తుది మార్కెట్ విలువలను ఖరారుచేస్తారు. మండల, జిల్లా స్థాయిలోని కమిటీల పరిశీలన తర్వాత ఆగస్టు నుంచి నూతన మార్కెట్ విలువలు అమలు చేసేలా స్టాంపులు - రిజిస్ట్రేషన్లశాఖ కసరత్తు చేస్తోంది.



### వాస్తవ పరిస్థితులకు అద్దంపట్టేలా..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారీగా మార్కెట్ విలువల సవరణలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను స్టాంపులు - రిజిస్ట్రేషన్ల శాఖ జారీ చేసింది. క్షేత్రస్థాయిలో సవరించాల్సిన మార్కెట్ విలువలు వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఆశాఖ కమిషనర్ నవీన్‌మిత్తల్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే - ల్యాండ్ రికార్డ్స్, పురపాలక శాఖ నుంచి సహకారం తీసుకోవాలని సూచించారు.

